AKSHARA TODAY
అక్షర చూటుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatodaynews.com

కుట్టుకూలిలో నిలువుదోపిడీ





కళ్లలో కారంచల్లి బంగారు గొలుసు చోరీ

విద్యుత్ మౌలిక వసతులను బలోపేతం చేశాం



అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: జిల్లాలో అదనపు విద్యుత్ సామర్థ్యం కోసం ట్రాన్స్‌ఫార్మర్లు, కొత్త సబ్ స్టేషన్లు, పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి నాణ్యమైన విద్యుత్ సరఫరాకు కృషి చేసినట్లు ట్రాన్స్‌కో ఎస్ఈ పీవీ రాజేశ్వర్ రావు పేర్కొన్నారు. పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా పంపిణీ వ్యవస్థను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా నిజామాబాద్ సర్కిల్ పరిధిలో రెండున్నరేళ్లుగా కృషి చేస్తున్నామన్నారు. లోడ్ పెరిగే అవకాశాన్ని ముందే గుర్తించి 19 పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని పెంచామన్నారు. అలాగే 22 అదనపు పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశామన్నారు. 267 ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని సైతం పెంచామన్నారు.

30-9-2026 NIZAMABAD / KAMAREDDY PAGES - 2

సమాఖ్య రుణాల్లో చేతివాటం



- మహిళల నిరక్షరాస్యతను ఆసరాగా చేసుకుని అక్రమ దందా..!
- కంచె చేను మేసిన చందంగా వీవోఏ తీరు
- రుణానికో రేటు వసూలు చేస్తున్నవైనం..

స్వయం సహాయక సంఘాల సభ్యులకు అండగా ఉంటూ, వారికి బ్యాంకుల నుంచి రుణాలు ఇప్పించి ఆర్థికంగా నిలదొక్కుకునేలా చూడాల్సిన గ్రామ సహాయకుడు(వీవోఏ) అవినీతికి బ్రాండ్ అంబాసిడర్‌గా మారాడు. కంచె చేను మేసిన చందంగా బ్యాంకులకు చెల్లించాల్సిన నెలవారీ వాయిదాల డబ్బులను నొక్కేస్తూ, రూ.లక్షల్లో సొంతానికి వాడుకుంటున్నట్లు సభ్యులు ఆరోపణలు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. **- అక్షరటుడే, డిచ్‌పల్లి**

డిచ్‌పల్లి మండలం లో జాతీయ రహదారికి సమీపంలో ఉన్న ఓ గ్రామంలో సుమారు 25 మహిళా సంఘాలు ఉన్నాయి. బ్యాంకు లింకేజీ రుణాల చెల్లింపులు, సభ్యుల పేర్లపై రుణాల వ్యవహారం, రుణాల మంజూరుకు కమీషన్ల వసూళ్లపై ఆరోపణలు తీవ్రమయ్యాయి. గ్రామ సమాఖ్యకు సంబంధించిన వ్యవహారాల్లో కీలకంగా వ్యవహరిస్తున్న వీవోఏ బ్యాంకుకు చెల్లించాల్సిన వాయిదాల సొమ్మును సకాలంలో జమ చేయలేదని, సభ్యుల పేర్లతో తీసుకున్న రుణాల వినియోగంపై అనుమానాలున్నాయని, రుణాలు ఇప్పించినందుకు డబ్బులు వసూలు చేశారని బాధిత మహిళలు వాపోతున్నారు.

కరోనా సమయం నుంచి..

కరోనా సమయంలో నిరక్షరాస్యులైన 8 సంఘాల మహిళలు బ్యాంకులకు వెళ్లలేక ఇబ్బంది పడగా, దాన్నే తానొక 'అవకాశం'గా మార్చుకున్నాడు సదరు వీవోఏ. వాయిదాలు తానే బ్యాంకులో కడతానని నమ్మించి, కొన్ని నెలల పాటు సేకరించిన మొత్తాన్ని బ్యాంకులో వేయకుండా సొంతానికి వాడేసుకోవడం కొందరు సభ్యులు నిలదీసిన విషయం బయట పడకుండా జాగ్రత్త పడ్డాడు. వరుసగా మూడు నెలలు వాయిదా పడకపోతే బ్యాంకు అధికారులకు అనుమానం వస్తుందని గ్రహించి, వ్యూహాత్మకంగా మూడో నెలకు సంబంధించిన కిస్తు మాత్రమే చెల్లిస్తూ అధికారుల కంటికి కనపడకుండా దాటవేస్తు వచ్చినట్లు మహిళలు ప్రధానంగా ఆరోపిస్తున్నారు. వీవోఏ బ్యాంకులకు ఎంత కట్టాడు, ఎంత నొక్కేశాడని వివరాలపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అధికారులకు విందులతో మచ్చిక

వీవోఏ తన అక్రమ వ్యాపారానికి అడ్డంకులు రాకుండా ఉండేందుకు ప్రత్యేక వ్యూహం అమలు చేస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. బ్యాంకుకు కొత్త అధికారులు వచ్చిన ప్రతిసారీ వారికి విందులు ఏర్పాటు చేస్తూ మచ్చిక చేస్తున్నట్లు మహిళలు వాపోతున్నారు. తనకు సమాచారం ఇవ్వకుండా బ్యాంకుకు వెళ్లిన వారిపై వీవోఏ చిర్రుబుర్రులాడి, మీకు లోన్లు రావని భయభ్రాంతులకు గురి చేస్తున్నట్లు మహిళలు వాపోతున్నారు.

రుణాలు ఇప్పించినందుకు అడ్డగోలుగా కమీషన్లు..

బ్యాంకు నుంచి రుణాలు మంజూరు చేసినందుకు ఆ వీవోఏ కమీషన్ వసూలు దందా చాలా ఏళ్లుగా సాగుతోంది. రూ. 50 వేల రుణం ఇప్పిస్తే రూ.500, రూ. లక్ష రుణం ఇప్పిస్తే రూ.వెయ్యి, రూ.2 లక్షలకు రూ.2వేలు, రూ. 3 లక్షలకు రూ.3 వేలు.. ఇలా రుణం స్థాయినిబట్టి మహిళా సభ్యుల నుంచి ఆ వీవోఏ ముక్కుపిండి వసూళ్లకు పాల్పడుతున్నట్లు వినికిడి. పొదుపు సమావేశానికి ఆలస్యం అయినా సభ్యుల నుంచి రూ. 100 అపరాధ రుసుమును వీవోఏ వసూలు చేస్తున్నట్లు సమాచారం.

అక్రమ బాగోతం బట్టబయలు

కొద్ది నెలల క్రితం ఓ సంఘం సభ్యురాలు తన భర్తతో కలిసి కొత్త రుణం కోసం బ్యాంకుకు వెళ్లడంతో వీవోఏ 'చేతివాటం' గుట్టు రట్టయింది. పాత బకాయిలు ఇంకా తీరలేదని బ్యాంకు అధికారులు చెప్పడంతో ఆ దంపతులు ఖంగుతిన్నారు. తానులోన్ తీయనుకోలేదని చెప్పగా... ఆమె పేరున వీవోఏ ముందే రుణం తీసుకుని సొంతానికి వాడుకున్నాడని తేలింది. విషయం బయటకు పొక్కితే తన ఉద్యోగం ఊడటంతో పాటు ఊళ్లో చెడ్డపేరు వస్తుందని భయపడిన వీవోఏ, సదరు మహిళ భర్త కాళ్లావేళ్లా ప్రాధేయపడి అప్పట్లో వ్యవహారాన్ని సర్దుబాటు చేసుకున్నట్లు కొందరు మహిళలు చెప్తుండటం గమనార్హం.

సభ్యుల పేర్లపై బినామీ రుణాలు

ఈ వీవోఏ అక్రమాలు వాయిదాల కాజేతకే పరిమితం కాలేదు. రుణాలు తీసుకునేందుకు ముందుకు రాని పేద మహిళలను బురిడీ కొట్టించి, వీవోఏ తన బైక్‌పై బ్యాంకులకు తీసుకెళ్లి వారి పేర్లతో రుణాలు మంజూరు చేయిస్తూ.. ఆ డబ్బును లబ్ధిదారులకు మహిళలకు ఇవ్వకుండా తనవద్దే ఉంచుకుని బినామీ రుణాల డబ్బుతో గ్రామంలో ఇతరులకు అధిక వడ్డీలకు తిప్పుతూ వ్యాపారం చేస్తున్నట్లు ఆ గ్రామంలో అందరూ కోడై కూస్తున్నారు. మహిళా సభ్యుల పేర్లపై రుణాలు మంజూరైనట్లయితే, ఆ డబ్బు ఎవరికి అందింది? ఖాతా నుంచి ఎవరు విత్ డ్రా చేశారు? రుణం తీసుకున్న సభ్యురాలు ఆ సొమ్మును స్వయంగా వినియోగించుకున్నారా? లేక



ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ఏర్పాటుతో రైతులకు మరింత ప్రయోజనం

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: జిల్లాలో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ఏర్పాటైతే స్థానిక రైతాంగానికి ఎంతో ప్రయోజనం కలుగుతుందని ప్రభుత్వ సలహాదారు, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. నందిపేట్‌లోని లక్కంపల్లి సెజ్‌ను ఆనుకుని ఉన్న స్థలాలను రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, కలెక్టర్ భవేష్ మిశ్రాతో కలిసి ఆయన పరిశీలించారు. సెజ్ ప్రాంతంలో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ కోసం గుర్తించిన స్థలం అనుకూలతపై అధికారులతో చర్చించారు. భవిష్యత్తులో ఇదే ప్రాంతంలో రిఫైనరీ ఏర్పాటుకు సైతం స్థలం అందుబాటులో ఉండడం, పొరుగున ఉన్న నిర్మల్ జిల్లా 50 కిలోమీటర్లలోపే చేరువగా ఉండడాన్ని ఆయన గుర్తించారు. అలాగే రెండు జిల్లాలలో ఇప్పటికే 17వేల ఎకరాల పైచిలుకు విస్తీర్ణంలో ఆయిల్ పామ్ సాగులో ఉండడం, మరో ఐదు వేల ఎకరాల వరకు సాగు విస్తీర్ణం పెరిగే అవకాశాలు ఉండడంతో సెజ్ సమీపంలో ఫ్యాక్టరీ నిర్మాణంపై కలెక్టర్‌తో చర్చించారు. సమగ్ర వివరాలతో నివేదిక సమర్పించాలని ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి అధికారులకు సూచించారు. రైతులు ఆయిల్ పామ్ సాగుకు స్వచ్ఛందంగా ముందుకు రావాలని సుదర్శన్ రెడ్డి కోరారు. వంట నూనె తయారీతో పాటు ఇతర అనేక ఉత్పత్తుల్లో వినియోగించే ఆయిల్ పామ్ పంటకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉందన్నారు. ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిజ్ఞాన్ మాల్వియా, అదనపు కలెక్టర్ రాజాగౌడ్, నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్రకుమార్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శ్రీనివాస్, డీసీసీ అధ్యక్షుడు నగేష్ రెడ్డి తదితరులు ఉన్నారు.

గందరగోళంగా డబుల్ బెడ్‌రూమ్ లక్కీ డ్రా

అక్షరటుడే, బాల్కొండ: మండల కేంద్రంలో నిర్వహించిన రెండో విడత డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ వివాదాస్పదమైంది. లక్కీడ్రా నిర్వహణలో అక్రమాలు జరిగాయనే ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేయడంలో అధికారులు డ్రా కార్యక్రమాన్ని నిలిపివేశారు. ప్రజాపాలన, గ్రామసభల్లో సమర్పించిన దరఖాస్తుల రిజిస్టర్లు కనిపించకుండా పోవడంపై బుధవారం నిర్వహించిన సభలో ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అనర్హుల జాబితా, ఆన్‌లైన్ నంబర్ల కేటాయింపులో తీవ్ర వ్యత్యాసాలున్నాయని స్థానికులు నిలదీశారు. ఎలాంటి ఆన్‌లైన్ నంబర్లు లేకుండానే సీరియల్ నంబర్లు ఇవ్వడం, అర్హులకు ఇంటి నంబర్లు చూపకపోవడంపై అధికారులను ప్రశ్నించారు. ఆన్‌లైన్‌లో పేర్లు చేర్చేందుకు కొందరు బ్రోకర్లు, అధికారులు రూ. 5,000 నుండి రూ. 10,000 వరకు లంచాలు తీసుకున్నారని లబ్ధిదారులు ఆరోపించారు. అర్హులైన పేదలను వదిలేసి, సంపన్న వర్గాలు, భూములు ఉన్నవారికే ప్రాధాన్యమిచ్చారని మండిపడ్డారు. అన్ని రకాల రసీదులు, మెసేజ్‌లు ఉన్నప్పటికీ తమ పేర్లు జాబితాలో లేవని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఒకేరోజు



ఉదయం 10 గంటలకు పంచాయతీ కార్యాలయంలో, 11 గంటలకు రైతు వేదికలో వేర్వేరుగా సభలు ఏర్పాటు చేయడం కలకలం రేపింది. అధికార పార్టీ జాబితాలో అక్రమాలు ఉన్నాయంటూ ప్రజాసంఘాలు, రాజకీయ నాయకులు అధికారులతో వాగ్వివాదానికి దిగడంతో లక్కీ డ్రా వాయిదా పడింది.

విద్యార్థుల భవిష్యత్తుకు ప్రభుత్వం ప్రాధాన్యత

అక్షరటుడే, కామారెడ్డి: విద్యార్థుల భవిష్యత్తే ప్రభుత్వ ప్రాధాన్యత అని ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల రోడ్డు పనులను బుధవారం పరిశీలించారు.

ఇచ్చిన మాట ప్రకారం..

షబ్బీర్ అలీ 15 రోజుల క్రితం కళాశాలకు వచ్చినప్పుడు కళాశాలకు వెళ్లే దారికి రోడ్డు వేయిస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ మేరకు రూ.12 లక్షలతో సీసీ రోడ్డు పనులు జరుగుతుండటంతో బుధవారం పరిశీలించి విద్యార్థులతో ముచ్చటించారు. ఆయన మాట్లాడుతూ 1,100 మంది అడ్మిషన్లతో జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలవడం అభినందనీయమన్నారు. కళాశాలలో నూతన తరగతి గదుల నిర్మాణానికి కూడా నిధులు మంజూరు చేస్తామన్నారు. హాస్టళ్లలో కాస్మోటిక్ చార్జీలను 200 శాతం పెంచామని, యూనిఫామ్స్, షూస్, పాఠ్యపుస్తకాలు ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. ప్రతి నియోజకవర్గానికి రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో



మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి, డీసీసీ మాజీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్, కౌన్సిలర్లు హర్షిత, ప్రియాంక, వనిత పాల్గొన్నారు.

కనీస వేతనాల జీవోను వెంటనే అమలు చేయాలి

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కనీస వేతనాలు జీవో నంబర్.6ను అమలు చేయాలని టీయూసీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్ ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. టీయుసీఐ జాతీయ ఉపాధ్యక్షుడు వనమాల కృష్ణ, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.నరేందర్, ఎం.సుధాకర్‌లు మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్రంలో మూడు కేటగిరీలుగా కనీస వేతనాలను ప్రకటించారన్నారు. దీంట్లో భాగంగానే ప్రభుత్వం జూన్ 1న గెజిట్ విడుదల చేసిందన్నారు. కానీ ఆచరణలో ఇది అమలు కావడం లేదని ఆరోపించారు. కేజీబీవీ, మోడల్ స్కూల్ హాస్టల్స్, మిషన్ భగీరథ, గ్రామపంచాయతీ, మున్సిపల్, ఆశ, అంగన్‌వాడీల్లో ఇప్పటికీ ఈ జీవో అమలు కావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వాస్తవానికి పెరుగుతున్న ధరలకు ఇస్తున్న వేతనాలకు పొంతనలేదని, జీవో 6 ప్రకారం ప్రభుత్వం ప్రకటించిన వేతనాలు కూడా సరిపోవని ఆవేదన వ్యక్తం చేశారు. టీయూసీఐ జిల్లా ఉపాధ్యక్షులు డి.రాజేశ్వర్, బి.మల్లేష్, డి.కిషన్, సాయరెడ్డి, మురళి, రాజేశ్వర్, రవి, లింగం, తారాచంద్, సుమలత, రాధా, సుమ, పద్మ, లింగం, గంగాధర్ పాల్గొన్నారు.





ప్రభుత్వ ఉద్యోగికి పదవీవిరమణ సహజమే..

అక్షరటుడే,నిజామాబాద్ సిటీ: ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి పదవీవిరమణ సహజమేనని సీపీ సాయిచైతన్య పేర్కొన్నారు. పోలీస్ శాఖలో పదవీవిరమణ పొందిన సిబ్బందిని సీపీ కార్యాలయంలో బుధవారం ఘనంగా సన్మానించారు. మాక్లూర్ ఏఎస్సై లక్ష్మణ్ 36ఏళ్ల పాటు పోలీస్‌శాఖలో విధులు నిర్వహించి పదవీవిరమణ చేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. పోలీస్‌శాఖలో ఎంతో పని ఒత్తిడితో విధులు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. అయినప్పటికీ ఎలాంటి రిమార్కు లేకుండా లక్ష్మణ్ పదవీ విరమణ చేయడం ఎంతో గొప్ప విషయమన్నారు. ప్రతీ ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ తప్పక ఉంటుందన్నారు. పదవీ విరమణ అనంతరం సైతం పోలీస్‌శాఖ ఎల్లవేళలా మద్దతుగా ఉంటుందని సీపీ తెలిపారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ యాషియా బేగం, ఆఫీస్ సూపరింటెండెంట్లు శంకర్, జగతి, వనమాల, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ రెడ్డి, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు (అడ్మిన్/వెల్ఫేర్) ధరణి కుమార్, శేఖర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

అర్సపల్లి ఆర్వోబీకి మంజూరైనవి 100శాతం కేంద్ర నిధులే : అర్వింద్



అక్షరటుడే, ఇందూరు: "భూపతి రెడ్డి.. ఎవరి చెవుల్లో పువ్వు పెడుతున్నావ్?" అని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ విమర్శించారు. అర్సపల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్వోబీ) నిర్మాణానికి 100 శాతం కేంద్ర ప్రభుత్వ నిధులే ఖర్చు చేస్తున్నామని స్పష్టం చేసిన ఆయన, ఎమ్మెల్యే భూపతిరెడ్డి ఇటీవల చేసిన ప్రకటనలపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఆర్వోబీ నిర్మాణ ప్రక్రియను వివరిస్తూ.. రాష్ట్ర ప్రభుత్వం ముందుగా బిల్లులు విడుదల చేసి కేంద్రానికి పంపితే, కేవలం 48 నుంచి 72 గంటల్లోనే కేంద్రం నుంచి ఆ నిధులు విడుదలవుతాయని ఎంపీ తెలిపారు. బుధవారం రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన రూ.14.77 కోట్లలో రూ.13.65 కోట్లు పూర్తిస్థాయిలో కేంద్ర ప్రభుత్వ నిధులేనని స్పష్టం చేశారు. ఈ బిల్లుల విడుదల ప్రక్రియ వేగవంతం చేయాలని తాను స్వయంగా రాష్ట్ర మంత్రులు భట్టి విక్రమార్క, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిలను పలుమార్లు కోరినట్లు గుర్తుచేశారు. ఈ సందర్భంగా మాధవ్ నగర్ ఆర్వోబీ విషయాన్ని ప్రస్తావిస్తూ ఎంపీ అర్వింద్ పలు ప్రశ్నలు గుప్పించారు. మాధవ్ నగర్ ఆర్వోబీకి సంబంధించి రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న అదనపు నిధులకు పరిపాలనా అనుమతులు ఎవరు ఇప్పించాలని ఎమ్మెల్యే భూపతిరెడ్డిని నిలదీశారు. ఈ అనుమతులు తక్షణమే రాకపోతే, ఆర్వోబీ రెండో వైపు కాంట్రాక్టర్ పనులు కొనసాగించే పరిస్థితి లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలకు ఎంతో అత్యవసరమైన ఈ ప్రాజెక్టును పూర్తి చేయాల్సిన పూర్తి బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపైనే ఉందన్నారు. 'కేంద్రం నుంచి నిధులు ఎలా తీసుకురావాలో మాకు బాగా తెలుసు, మాకు ఎవరి సలహాలూ అవసరం లేదు. రాష్ట్ర ప్రభుత్వం చేయాల్సిన పనిని బాధ్యతాయుతంగా పూర్తి చేయాలి' అని హితవు పలికారు.

బస్సుల కోసం రోడ్డెక్కిన విద్యార్థులు



అక్షరటుడే, బోధన్: బస్సుల కోసం విద్యార్థులు రోడ్కెక్కారు. ఈ ఘటన బోధన్ నియోజకవర్గంలోని సాలూర మండలంలో బుధవారం చోటు చేసుకుంది. సాలూర మండలంలోని ఖాజాపూర్ గ్రామం వద్ద బుధవారం విద్యార్థులు ఆర్టీసీ బస్సును అడ్డుకుని నిరసన తెలిపారు. సుంకిని నుంచి సాలూరు మీదుగా వెళ్లే బస్సులు సరిపడా లేకపోవడంతో తాము ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు. నిత్యం కళాశాలలు, పాఠశాలలు లేటుగా వెళ్లాల్సి వస్తోందన్నారు. బస్సు ముందు కూర్చొని నినాదాలు చేశారు. సమాచారం అందుకున్న బోధన్ రూరల్ ఎస్సై రాజశేఖర్ అక్కడికి చేరుకుని విద్యార్థులతో మాట్లాడారు. డీఎంతో మాట్లాడి అదనపు బస్సు ఏర్పాటు కోసం ప్రయత్నిస్తానని హామీ ఇవ్వడంతో విద్యార్థులు ధర్నా విరమించారు.



అన్ని వార్డులకు సమానంగా లక్కీ డ్రా నిర్వహించాలి

అక్షరటుడే, ఆర్మూర్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డులకు సమానంగా డబుల్ బెడ్ రూమ్ కేటాయింపులకు గాను లక్కీ డ్రా నిర్వహించాలని బీజేపీ కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు సబ్ కలెక్టర్ అభిజ్ఞాన్ మాల్వియాకు వినతిపత్రం అందజేశారు. కొన్నివార్డులో అధికంగా 40 మందిని ఎంపిక చేసి కొన్ని వార్డుల్లో పదిమందినే లక్కీ డ్రాకు ఎంపిక చేశారన్నారు. ఇటీవల నూతనంగా దరఖాస్తులు తీసుకున్న వారిలో అర్హులైన లబ్ధిదారుల పేర్లను లక్కీడ్రాలో చేర్చకపోవడానికి కారణాలకు తెలపాలని సూచించారు. లక్కీ డ్రాలో అక్రమాలు జరగకుండా చూడాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కౌన్సిలర్ యాదాద్రి కవిత భాస్కర్, శ్రీనివాస్, కాందేశ్ ప్రశాంత్, శ్రావణ్ గౌడ్, దినేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు స్కూల్ యూనిఫాం ఐకేపీకి ప్రభుత్వం బాధ్యతను అప్పగించించి. ఈ సందర్భంగా ఐకేపీ స్థానిక దర్జీలకు వస్త్రం ఇచ్చి కుట్టేందుకు పని కల్పించింది. అయితే కులి డబ్బుల చెల్లించేక్రమంలో కొందరు ఐకేపీ సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

– అక్షరటుడే గాంధారి



కుట్టుకూలిలో నిలువుదోపిడీ..

■ విద్యార్థుల యూనిఫాం కుట్టడంలో దర్జీలకు అన్యాయం ■ ప్యాంట్ షర్ట్‌లకు ప్రభుత్వం కేటాయించినది రూ.65
■ రూ.30 నగదు ఇస్తూ మోసం చేస్తున్న సిబ్బంది..! ■ బిల్లులు ఆలస్యం అవుతుండడంతో ఇబ్బందులు

పాఠశాలలు, కళాశాలల విద్యార్థులలో ప్యాంట్, షర్ట్, ఫ్రాక్ కుట్టేందుకు దర్జీలకు రూ.65 ఇవ్వాల్సి ఉంది. అయితే ఈ రూ.65 కూడా ఏ లెక్కన ప్రభుత్వం తమకు ఇస్తుందో ఏమాత్రం అర్థం కావట్లేదని దర్జీలు వాపోతున్నారు. కుట్టులో భాగంగా కాజా, గుండీలకు రూ.7 ఇతరులకు ఇవ్వగా.. ఇంకా అందులో మిగితే రూ.58తో తమకు ఏమాత్రం గిట్టుబాటు కాదని వారంటున్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఈ పథకంలో దర్జీవారికి మాత్రం ఏమాత్ర ఆమోదయోగ్యం కాని ధరలు చెల్లిస్తున్నారని దర్జీలు వాపోతున్నారు.

ఐకేపీ సిబ్బంది దోపిడీ..!

గాంధారి మండలంలోని దాదాపు 45 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. అందులో 75 పాఠశాలకు గాను 4,123 మంది విద్యార్థులు ఉన్నారు. అయితే ఇందులో మొదటి విడతలో దర్జీలు 100శాతం దుస్తులు కుట్టి ప్రభుత్వానికి అప్పజెప్పారు. రెండో విడతలో దాదాపు 70శాతం పూర్తికాగా.. మరో ముప్పై శాతం పనులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయి. డ్రెస్‌లు స్టిచ్చింగ్ చేయడాన్ని అక్టోబర్ 1వ తేదీలోపు పూర్తి చేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు సైతం జారీ చేశారు. అయితే ఈ కుట్టుకూలి తమకు ఏమాత్రం ఉపయోగం లేదని.. కేవలం పని వదులుకోవద్దనే ఉద్దేశంతోనే తాము ఈ పనిచేస్తున్నామని దర్జీలు వాపోతున్నారు. అయితే ప్రభుత్వం నుంచి బిల్లులు రావాలంటే నెలలు పడుతుందని.. మీకు తొందరగా డబ్బులు కావాలంటే రూ.30 వెంటనే ఇస్తామని కొందరు ఐకేపీ సిబ్బంది పేర్కొంటున్నారని దర్జీలు తెలిపారు. ఇలా తమ శ్రమదోపిడీ చేస్తున్నారని వారు వాపోయారు.

మా దృష్టికి రాలేదు..

దర్జీలకు రూ.75 వస్తుంది. అందులో కటింగ్ చేయడానికి రూ.10 పోను.. దర్జీలకు రూ.65 ఇస్తున్నాం. అయితే డబ్బులు త్వరగా ఇస్తామని దర్జీలను కొందరు సిబ్బంది మభ్యపెడుతున్నారనే అంశం నా దృష్టికి రాలేదు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే ఉన్నాధికారులకు సమాచారం అందిస్తాం.

– ప్రసన్నకుమార్, ఐకేపీ ఏపీఎం గాంధారి

తెలంగాణ ఉద్యమకారుల వేదిక జిల్లా అధ్యక్షుడికి సన్మానం



అక్షరటుడే, బాల్కొండ : ఉమ్మడి జిల్లా తెలంగాణ ఉద్యమకారుల వేదిక అధ్యక్షుడు షేక్ రహీముద్దీన్‌ను బాల్కొండ మండలం కిసాన్‌నగర్‌లో ఘనంగా సన్మానించారు. గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షుడు కొండ అశోక్, కార్యదర్శి రవీందర్ కలిసి షేక్ రహీముద్దీన్‌ను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వీడీసీ సభ్యులు పెసరి నవీన్, చిన్నదాస్, శివ, చింత రఘు, సూర శంకర్, శంకర్ పంతులు పాల్గొన్నారు.



పారిశుధ్య కార్మికులకు ఉచిత ఆరోగ్య శిబిరం

అక్షరటుడే, ఆర్మూర్ : ఆర్మూర్ పురపాలక సంఘం ఆధ్వర్యంలో బుధవారం స్వచ్ఛత హీ సేవ-2026 కార్యక్రమాన్ని నిర్వహించారు. దీంట్లో భాగంగా పురపాలక కార్యాలయంలో పారిశుధ్య కార్మికులకు ఉచిత ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. వారికి వైద్య పరీక్షలు నిర్వహించి, సూచనలు సలహాలు అందించారు. పారిశుధ్య కార్మికులు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవడంతో పాటు, విధి నిర్వహణలో వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్య భద్రతా చర్యలను పాటించాలని సూచించారు. చైర్‌పర్సన్ గోనెహరి రఘు, మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజు, సానిటరీ ఇన్స్పెక్టర్ నరేందర్, పర్యావరణ ఇంజినీర్ పూర్ణమోళి, వైద్య సిబ్బంది, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

ఘనంగా రాజ్యాంగ అవగాహన కార్యక్రమం



అక్షరటుడే, బోధన్: బోధన్ మండలంలోని అమ్డాపూర్ గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఛత్రపతి శివాజీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భారత రాజ్యాంగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు అడ్లూరి శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడు వారే దస్తగిరి రాజ్యాంగం, పౌరుల హక్కులు బాధ్యతలపై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు సత్యనారాయణ, మాజీ సర్పంచ్ సుదర్శన్, పెర్కా వెంకటేష్, అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

మెండోరాలో ఉపాధి హామీ ప్రత్యేక గ్రామసభ

అక్షరటుడే, భీమ్‌గల్: గ్రామీణ ఉపాధి హామీ (వీబీ జీ రాంజీ) పథకంలో భాగంగా గ్రామంలో చేపట్టాల్సిన కొత్త పనులను గుర్తించేందుకు సర్పంచ్ కుంట లక్ష్మీ రమేష్ ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. సర్పంచ్ మాట్లాడుతూ.. ఈ పథకం కింద ప్రభుత్వం 375 రకాల పనులను చేర్చిందని, వాటిలో గ్రామానికి అత్యంత ఆవశ్యకమైన పనులను ఈ సభలో చర్చించి ప్రతిపాదిస్తున్నట్లు తెలిపారు. ప్రధానంగా రైతులకు ఉపయోగపడే పశువుల, గొర్రెలు, మేకల కొట్టాలు, పొలం రోడ్లు, నీటికుంటలు, చెక్ డ్యామ్‌లు, కరకట్టల నిర్మాణం, అలుగు, తూముల మరమ్మతులు లేదా కొత్త వాటి నిర్మాణం, సాగునీటి, వరద కాలువల పనులను ఈ జాబితాలో చేర్చినట్లు వివరించారు. నేడు చర్చించిన పనులపై రాబోయే అక్టోబరు 2న జరిగే గ్రామసభలో ఆమోదం తెలిపి తీర్మానం చేయనున్నట్లు వెల్లడించారు.



అర్హులైన నిరుద్యోగ కళాకారులు అందరికీ ఉద్యోగాలు కల్పించాలి



అక్షరటుడే, ఇందూరు: కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో చెప్పిన విధంగా అర్హులైన ఉద్యమ కళాకారులకు ఉద్యోగాలు ఇవ్వాలని నిజామాబాద్ జిల్లా ఉద్యమ నిరుద్యోగ కళాకారుల అధ్యక్షుడు చిట్టిబాబు డిమాండ్ చేశారు. బుధవారం హైదరాబాద్ నగరంలోని రవీంద్ర భారతి వద్ద జరిగిన శాంతియుత నిరసన కార్యక్రమానికి జిల్లా కళాకారులు వెళ్లడానికి సిద్ధం కాగా.. పోలీసులు ముందుగానే తమను నిర్బంధించారన్నారు. అయినప్పటికీ కొందరు కళాకారులు రవీంద్రభారతికి చేరుకుని నిరసన తెలిపారన్నారు. జిల్లా నుంచి ప్రధాన కార్యదర్శి గణేష్, కళాకారుడు గోపాల్ ముందుగానే నిరసన నిమిత్తం వెళ్లారని తెలిపారు. తమకు ఉద్యోగాలిచ్చి ఆదుకోవాలని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. నిజామాబాద్ జిల్లాలో 200కు పైగా ఉద్యమ నిరుద్యోగ కళాకారులు ఉన్నారని, 25 మందికి మాత్రమే ఉద్యోగాలు కల్పించడం సరికాదన్నారు. జిల్లాలో చిట్టి బాబు, కర్క రమేష్, మహేందర్, పొగరీ సంజీవ్, గోదావరి, ప్రవంతి, సంతోష్, నరేష్, శ్రీధర్‌తో పాటు కళాకారులను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు.

బాల్కొండ పాస్టర్స్ అసోసియేషన్ ఎన్నిక



అక్షరటుడే, భీమ్‌గల్: బాల్కొండ నియోజకవర్గ పాస్టర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బాల్కొండ నియోజకవర్గ అధ్యక్షుడిగా పాస్టర్ రాజారత్నం, ప్రధాన కార్యదర్శిగా పాస్టర్ పిలోమోన్ (భీమ్‌గల్) ఎన్నికయ్యారు. కోశాధికారిగా పాస్టర్ సియోన్ కుమార్ (వేల్పూర్), ఉపాధ్యక్షుడిగా పాస్టర్ రణవీర్ (కమ్మర్‌పల్లి)లను ఎన్నుకున్నట్లు ఎన్నికల కమిటీ ప్రతినిధులు, నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు పాస్టర్ ఆనంద్, పాస్టర్ దైవచిత్తం ప్రకటించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు రాజారత్నం మాట్లాడుతూ.. నియోజకవర్గ పరిధిలోని క్రైస్తవుల సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా కృషి చేస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ మండలాల అధ్యక్షులు, కార్యదర్శులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.


24 నుంచి ఎంఈడీ పరీక్షలు

అక్షరటుడే, తెయూ క్యాంపస్: తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో ఎంఈడీ రెండో సెమిస్టర్ రెగ్యులర్ థియరీ పరీక్షలు అక్టోబర్ 24 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు కంట్రోలర్ సంపత్ కుమార్ ఒక ప్రకటనలో వివరాలు తెలిపారు. ఈ పరీక్షలు మధ్యాహ్నం 2:00 గంటల నుంచి సాయంత్రం 5 వరకు జరుగుతాయన్నారు. పరీక్షల పూర్తి వివరాలు తెలంగాణ యూనివర్సిటీ వెబ్ సైట్‌లో పొందుపర్చామన్నారు.

వృథాగా పోతున్నా పట్టించుకోరా..!

మండలంలోని పీఎంశ్రీ జిల్లా పరిషత్ హైస్కూల్ వద్ద నెలరోజులుగా మిషన్ భగీరథ నీరు వృథాగా పోతున్నా అధికారులు పట్టించుకోవట్లదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. హైస్కూల్ వద్ద బాన్సువాడ కామారెడ్డి ప్రధాన రహదారిపై ప్రతిరోజు నీరు వృథాగా పోతోందని వారు పేర్కొన్నారు. అధికారులు తక్షణమే చర్యలు తీసుకుని తాగునీరు వృథా కాకుండా అరికట్టాలని కోరుతున్నారు.

– అక్షరటుడే, గాంధారి



కళ్లలో కారంచల్లి బంగారు గొలుసు చోరీ





అక్షరటుడే, కామారెడ్డి : కామారెడ్డి పట్టణంలో వరుస దొంగతనాలు కలకలం రేపుతున్నాయి. బంగారం కోసం ఓ వృద్ధురాలిని హత్య చేసిన ఘటన మరవకముందే మరోచోట మహిళ కళ్లలో కారం చల్లి ఐదు తులాల బంగారు గొలుసు ఎత్తుకెళ్లారు. జిల్లా కేంద్రంలోని కల్కి నగర్ కాలనీలో సుదర్శన్ ఇంట్లోకి మంగళవారం అర్ధరాత్రి ముగ్గురు దుండగులు చొరబడ్డారు. హాల్లో నిద్రిస్తున్న శోభ అనే మహిళ మెడలోని ఐదు తులాల గొలుసును లాక్కునేందుకు ప్రయత్నించగా, ఆమె అరిచేందుకు యత్నించడంతో కళ్లలో కారం చల్లారు. అడ్డుకోబోయిన కూతురిని బెదిరించి గొలుసుతో పరారయ్యారు. ఈ ఘటన కాలనీలో కలకలం రేపింది. అంతకుముందు రాత్రి 7:30 గంటల ప్రాంతంలో పాత బస్టాండ్ కొటారిగల్లీలో 70 ఏళ్ల వృద్ధురాలు అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. బంగారు ఆభరణాల కోసమే హత్య జరిగినట్లు సీఐ నరహరి తెలిపారు. నిందితుల కోసం గాలిస్తున్నట్లు పేర్కొన్నారు. కాగా ఒకేరోజు గంటల వ్యవధిలో రెండు ఘటనలు జరగడంతో పట్టణంలో భయాందోళన నెలకొంది. రెండు ఘటనలపై పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైతు రుణాలను మాఫీ చేయాలని తీర్మానం

అక్షరటుడే, బోధన్: పెండింగ్‌లో ఉన్న రైతు రుణాలను తక్షణమే మాఫీ చేయాలని పెంటాకుర్దు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ మహాజన సభలో తీర్మానం చేశారు. సంఘ ఆవరణలో బుధవారం వార్షిక మహాజన సభ నిర్వహించారు. ఈ సమావేశానికి సంఘం చైర్మన్ అమర్ నాథ్ బాబు అధ్యక్షత వహించారు. సీఈవో రవూఫ్ వార్షిక జమాఖర్చులను చదివి వినిపించారు. సంఘం తరపున రైతులకు అందిస్తున్న సేవలు, రైతుల సమస్యలు, తీర్మానాలపై చర్చించారు. యూరియా యాప్‌ను తక్షణమే రద్దు చేసి పాత పద్ధతిలో యూరియా సరఫరా చేయాలని తీర్మానించారు. సంఘ అభివృద్ధి రైతుల సహకారంతో సాధ్యమవుతుందని అధ్యక్షుడు పేర్కొన్నారు. సమిష్టి కృషి వల్లే సంఘం సుభిక్షంగా ఉందని స్పష్టం చేశారు. ఈ మహాజన సభలో సంఘ వైస్ చైర్మన్ రమేష్ గౌడ్, పాలకవర్గ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

